ఈవారం కథ

# పరిమళ

"మీరు నా గురించి ఒక కథ వ్రాయకూడదూ?" గోరింటాకు పెట్టుకున్న వేళ్లవంక మురిపెంగా చూసుకుంటూ హఠాత్తుగా అడిగింది పరిమళ.

బుచ్చిబాబు కథలో కుముదం గుర్తుకొచ్చింది నాకు వెంటనే. ఏ కథా రచయిత జీవితంలోనైనా ఇలాంటి సన్నివేశం ఒక్కటయినా తప్పదేమో. నేను కూడా బుచ్చిబాబు శైలిలోనే "నీ గురించి వ్రాయడానికి ఏముంది?" అన్నాను.

"నా గురించి వ్రాయడానికి ఏమీ లేదా?" కళ్లెత్తి సూటిగా నా కళ్లలోకి చూస్తూ అడిగింది.

పరిమళ వంక పరిశీలనగా చూసాను. సాధారణమయిన రూపం. అనాకారి తనమూ లేదు. నిలబెట్టేంత ఆకర్షణీయతా లేదు. ఉన్నా అందంలో కనురెప్పల కింద నుండి కదిలిపోయే నీడల్లోనూ, హృదయ స్ఫూర్తిగా నవ్వి నవ్వడు పడే బుగ్గల సొట్టల్లోనూ యిమిడిపోయింది. ఈ కాస్త అందం కూడా లేకపోతే....

"ఏంటి సార్? ఆలోచనల్లో పడిపోయారు?" నా ఆలోచనల ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ అడిగింది పరిమళ.

"ఏమీలేదు!" అన్నాను.

"ఏమీ లేదు అంటే ఆలోచనల్లో ఏమీ లేదు అనా? లేక నా గురించి వ్రాయడానికి ఏమీ లేదు! అనా!" మళ్లీ మొదటికొస్తూ అడిగింది పరిమళ.

రెండూ యింటూ మూడు అడుగుల వైశాల్యంతో విస్తరించుకున్న అతి చిన్న/అతిపెద్ద గది అది. ఒక మూలంగా ఓ చిన్న స్టౌ దానిమీద మసిబారిన రెండు గిన్నెలు. పక్కనే చేటలో ఓ రెండొందల గ్రాముల సబ్సిడీ బియ్యం. దానిపక్కన ఒక చిన్న ట్రంకుపెట్టె. పైన విడదీసిన ఒక చీర లోపల్లంగా! ముందు నాలుగుసార్లు కుట్లుపడిన చెప్పుల జత. పక్కన సగం చుట్టి వదలిన చాపమీద నూనె మరకలు పేరుకుపోయిన తలగడ. దాని మీద వరుసగా పడేసిన బి.ఎస్.ఆర్.బి. వర్క్ బుక్సు, చివరి పేజీలు చిరిగిపోయిన రాజకీయ అర్థశాస్త్రము, రెండు మూడు దళిత కవితా సంపుటులు, కొడవగంటి కుటుంబరావు అరుణోదయం నవలా...టూకు విరిగిపోయిన నాలుగు కేసెట్లు. అప్పుడెప్పుడో నేనే బహుమతిగా యిచ్చిన ఒక వాక్‌మన్. ఒక ప్లాస్టిక్ బకెట్, సగం విరిగిపోయిన మగ్గు. యింతే పరిమళ సామ్రాజ్యం. ఈ చిన్న గదికి ఓనరాసురుడు ఒకటో తారీకు ఇంకో ఇరవై నాలుగ్గంటల్లో వస్తుందనగానే నిలబెట్టి మరీ రెండు వందల యాభై రూపాయలు వసూల్జేస్తాడు. ఫైనాన్స్ కంపెనీలాగా రెండు రోజుల ఆలస్యానికి కూడా మూడు, నాలుగు రూపాయల వడ్డీ యివ్వాలంటాడు.

"నేను చాలా సామాన్యమయిన మనిషినండీ. అద్భుతమయిన అందంలేదు. ఆకర్షణీయతా లేదు. గొప్పగా చెప్పుకునేందుకు చదువూ లేదు. ఈ దేశంలో వున్న కొన్ని కోట్ల మంది సామాన్యులకు నేను అచ్చమయిన ప్రతీకను. మంచి మంచి కథలన్నీ జీవితాల్లోంచే వస్తాయంటారు కదా! మీరలాంటప్పుడు నా జీవితంలోంచి ఒక మంచి కథను మీరు పిండలేరా?" కాఫీ కప్పు చేతికి అందిస్తూ ప్రశ్నించింది పరిమళ. ఆలోచనల్లో పడి నేను గమనించలేదు కానీ...క్షణంలోనో...అరక్షణంలోనో, కాఫీ తయారు చేసి వుంటుంది. కాఫీ కప్పు అందుకుంటూ ఆమె చేతివ్రేళ్లు తాకాలన్న నా యవ్వన చాపల్యాన్ని మాత్రం నేను వదులుకోలేకపోయాను. నేను యవ్వన చాపల్యం అంటున్నాను కానీ ఫెమినిస్టులయితే ఎమ్.సి.పి. అంటారేమో..


"జీవితాన్ని యధాతథంగా అనువదిస్తే అది కథకాదు. నువ్వాన్నావే కొన్ని కోట్ల మంది సామాన్యులకు ప్రతీకను అని. ఈ కొన్ని కోట్లమంది జీవితాల్లోనూ ఏ ఒక్క సంఘటనా Differentగా వుండదు. పుట్టటం, పెరగటం, వివాహించడం, సంసార సాగరంలో మునిగి తేలడం, పిల్లల్ని కనడం, వాళ్లకు భవిష్యత్ నియ్యడానికి నానా గడ్డి కరవడం, గెలుపులాంటి ఓటమో, ఓటమిలాంటి గెలుపో పొందటం మరణించడం...ఇంతేకదా! ఈ విషవలయం గురించి నా ముందుతరంవాళ్లూ, నా తరంవాళ్లూ పుంఖాను పుంఖాలుగా రాసేసారు. అయినా నువ్వు అడిగావు కాబట్టి నేను రాస్తాను. నీ జీవితంలో అద్భుతమయిన 'నాటకీయత' కలిగిన సన్నివేశం ఒకటి చెప్పు" అన్నాను కాఫీ కప్పు పరిమళకి అందిస్తూ.

"తప్పుసార్! జీవితంలో నాటకీయత ఉప్మాలో ఉండలు పైకి తేలినట్టుగా తేలి కన్పించదు. మీ అంతర్నేత్రంలో చూడండి" అన్నది సవాలు విసిరినట్లుగా జడను ముందునుండి వెనక్కు విసురుకుంటూ.

* * * *

పరిమళకి ఎవరూ లేరు. స్థానికంగా వున్న ఒక ప్రయివేటు స్కూల్లో టీచర్‌గా పన్జేస్తుంది. నెలకు ఐదువందల రూపాయల జీతం వస్తే అందులో సింహభాగం ఇంటి అద్దెకే సరిపోతుంది. ద్రవ్యోల్బణం రోజుల్లో రెండు వందల యాభయి రూపాయలు ఎలా సరిపోతాయి అన్నది ఒక పెద్ద ప్రశ్న అయితే, ఈ దేశ ఆర్థిక వ్యవస్థ అంత చిన్నది జవాబు.

**సాధారణమయిన రూపం. అనాకారి తనమూ లేదు. నిలబెట్టేంత ఆకర్షణీయతా లేదు. వున్నా అందంలో కనురెప్పల నుండి కదిలిపోయే నీడల్లోనూ, హృదయ స్ఫూర్తిగా నవ్వినప్పుడు పడే బుగ్గల సొట్టల్లోనూ యిమిడిపోయింది.**




## వంశీకృష్ణ

పరిమళతో నా పరిచయం జరిగి దాదావు రెండు సంవత్సరాలు కావస్తోంది. పరిమళని మొదటిసారి నేను బస్టాండ్లో చూశాను. అదీ హిగ్గిన్ బాదమ్స్ కుర్రాడితో ఘర్షణ పడుతున్నవ్వుడు. మా ఊరు ఆర్థికంగామూ, సామాజికంగామూ బాగా వెనుకబడిన ఊరు. నేషనల్ హైవేమీద ఉంది కాబట్టి, వచ్చి పోయ్యే బస్సుల షెల్టర్ కోసం ఒక పెద్ద బస్టాండు, ఒక హిగ్గిన్ బాదమ్స్ వెలసాయి కానీ...ఇక్కడి నుండి ప్రయాణించే వాళ్లకి అంత పెద్ద బస్టాండు, అన్ని ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజరు బస్సులు అనవసరం. అన్నిరకాల పేపర్లు కలసి ఆ ఊరికి వచ్చేవి రెండొందలో, రెండు వందల యాభయ్యో. అందులో నగం బస్టాండులోనే వుండిపోతాయి. మిగతా సగం పేపర్ బాయ్స్ ద్వారా యిళ్లకు సరఫరా అవుతాయి. దానా... దీనా బస్టాండ్లో తప్పితే మరెక్కడా పేపరు దొరకదు. అదే అవకాశంగా రెండు రూపాయల ముప్పై పైసల తెలుగు పేపర్ని రెండు యాభై పైసలకు, వీలుంటే మూడు రూపాయలకు అమ్ముతుంటాడు పేపర్ స్టాలు కుర్రాడు.

అలాంటిదే ఒక సందర్భంలో ఇరవై పైసల కోసం ఊరు వాడా ఏకం చేస్తున్న పరిమళ నా దృష్టిని ఆకర్షించింది.

"ఇస్తే మర్యాదగా ఇరవై పైసలు తిరిగి అన్నాయివ్వు. లేకపోతే రెండు రూపాయల యాభై పైసలకు బిల్లు అయినా యివ్వు" అంటుంది పరిమళ.

"నేను బిల్లూ యివ్వను. యిరవై పైసలు తిరిగీ యివ్వను. యిష్టమయితే పేపర్ తీసుకో! లేకపోతే పేపర్ యిచ్చెయి" అంటాడు బుక్ స్టాలు వాడు.

"ఇరవై పైసల గురించి యింత గొడవ ఎందుకండీ" అన్నాడో ప్రయాణీకుడు.

"గొడవ యిరవై పైసల గురించి కాదండి. జనం అసహాయతను డబ్బు చేసుకుంటున్న వీడి దోపిడీ స్వభావం మీద. ఈ వూళ్లో యిక్కడ తప్పితే మరెక్కడా పేపరు దొరకదు. అది అలుసుగా తీసుకుని పేపరుకి యిరవై పైసల చొప్పున, మూట యాభై పేపర్లు అమ్మితే మూటయాభై యింటూ ఇరవై రూపాయలు. నెలకు తొమ్మిది వందలు, సంవత్సరానికి పదివేల ఎనిమిది వందల రూపాయలు ప్రజల సొమ్మును అన్యాయంగా అనుభవిస్తున్నాడు" ఆవేశంగా అంది పరిమళ.

ఆ అమ్మాయి వాగ్ధాటికి అదిరిపోయారు అక్కడున్న వాళ్లంతా. ఇంకా సేపు ఆ అమ్మాయి అక్కడే వుంటే యింకేం జరుగుతుందో అనుకున్న బుక్‌స్టాల్ వాడు గబుక్కున పావలా తీసి పరిమళ చేతిలో పెట్టాడు. పర్సు మూల మూలలూ వెతికి ఐదు పైసల బిల్ల తీసి వాడి చేతిలో పెట్టి పేపరు తీసుకుని ఆ అమ్మాయి వెళ్లిపోయింది.

అది పరిమళను నేను మొదటిసారి చూసిన సందర్భం. ఈ ఫైర్ బ్రాండ్ ఎవరో బస్టాండ్ అంతా దున్నిపడేసింది. లెక్కల్లో చాలా ఘటికురాలే అనుకున్నాను.

ఇలాంటి మరో రెండు పేచీకోరు సందర్భాలలో నేను పరిమళను

> **ఆ అమ్మాయి వాగ్ధాటికి అదిరిపోయారు అక్కడున్న వాళ్ళంతా. ఇంకాసేపు ఆ అమ్మాయి అక్కడే వుంటే యింకేం జరుగుతుందో అనుకున్న బుక్‌స్టాల్ వాడు గబుక్కున పావలా తీసి పరిమళ చేతిలో పెట్టాడు.**



చూసాను. ప్రత్యక్షంగా పరిచయం కలిగింది మాత్రం ఒక వర్షం కురిసినరాత్రి. నా గదిలో రాత్రి ఎనిమిది గంటలప్పుడు బయటంతా వానపడుతూ వుండగా... ఎక్కడికీ వెళ్లేందుకు వీలుకాక వొంటరిగా వున్నాను. చేసేందుకు ఏమీ లేక పుస్తకాల షెల్ఫ్‌లోంచి "ఏమీ కాదు" అన్న కవితా సంపుటితీసి చదవసాగాను. కిటికీ ప్రక్కగా ఎవరో కదిలినట్లు అన్పించింది. తలుపుతీసి చూద్దును కదా... ఎవరో అమ్మాయి. పడుతున్న వర్షం బారినుండి తప్పించుకోవటానికి గది చూరు క్రిందకు చేరింది.

లోపలకు రమ్మని ఆహ్వానించాను. గదిలో లైటు వెలుతుర్లో ఆ అమ్మాయిని పరిశీలనగా చూసి అదిరిపోయాను. సేమ్ ఫ్లైర్ బ్రాండ్. చీర కొంగుతో తల తుడుచుకుంటూ నా వంక, నా గదే వంక పరిశీలనగా చూడసాగింది. ఆ అమ్మాయిని నాలుగైదుసార్లు చూసి వుండటంచేత కొత్త అన్పించలేదు నాకు. కానీ ఆ అమ్మాయికి నేను ఖచ్చితంగా కొత్తే.

"నా పేరు పరిమళ" అన్నది తనను తాను పరిచయం చేసుకుంటూ!

ప్రతిగా నేనూ పరిచయం చేసుకున్నాను. దాదాపు అర్ధగంటసేపు నా రూమ్‌లో వుండిపోయింది, బయట వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో.

ఈ అర్ధగంటలో ఆ అమ్మాయే కొంచెం ఎక్కువగా మాట్లాడి వుంటుంది. ఫ్లైర్ బ్రాండ్ అన్న విషయం తెలుసు కాబట్టి నా నోరు నా కంట్రోల్‌లోనే వుంది.

ఆ అమ్మాయి మాట్లాడుతున్నంత సేపు తన కళ్లన్నీ నా టేబుల్‌మీద వున్న బుచ్చిబాబు కథా సంకలనం మీదే వున్నాయి. వెళ్లిపోయే ముందు "ఈ పుస్తకం నేను చదివి యివ్వొచ్చా?" అని అడిగింది.

"తీసుకోండి" అన్నాను.

పరిమళ వెళ్లిపోయింది.

తను వెళ్లిపోయిన ఆ పరిమళమంతా గది నిండిపోయింది. ఆ తర్వాత చాలాసార్లు పరిమళని కలిసాను. పరిమళకి ఎవరూ లేరు.

ఆశ్రమంలో అనాథగానే పెరిగింది. దొరికిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డిగ్రీ వరకు చదువుకుంది. డిగ్రీ చదువుకుని విశాల ప్రపంచంలోకి అడుగిడింది. ఒకరకంగా తనదంతా ఒంటరి పోరాటమే! ఎవరి జీవితం వాళ్లకి ఒంటరి పోరాటమే!

నాకు తెలిసిన పరిమళ జీవితమంతా మననం చేసుకున్నాను. అద్భుతమయిన నాటకీయతవున్న సన్నివేశం ఒక్కటి కూడా దొరకలేదు. మరిక కథ ఏం వ్రాయను?

* * * *

"ఏం మాస్టారు కథ గురించి ఏం చేశారు?" కళ్లనిండా ఉత్సుకత నింపుకుని ప్రశ్నించింది పరిమళ.

"నాలో సృజనాత్మకతకి యిది పరీక్షా?" స్కూటర్ స్టాండ్ వేస్తూ అడిగాను.

"ఒకరకంగా పరీక్షే అనుకోండి" అన్నది.

"కవిత్వం వ్రాయాలంటే, నిరుపహతి స్థలము అంటూ ఒక లిస్టు చదివాడుగా పెద్దనామాత్యుడు. మరి కథమాత్రం అంత తేలిగ్గా వుడుతుందా? మీరు కొంచెం స్పీడ్ తగ్గించాలి" అన్నాను పరిమళ గదిలోకి దారితీస్తూ!

## హైకూలు

కాలువగట్టు అంచున
గడ్డి మొలకా- నీడా
ప్రవాహానికి కదులుతున్నాయి.

* *

వానకి వానకి మధ్య
తడి చప్టా మీద
మేఘాలు వెళ్తున్నాయి.

* *

వరి పొలాల్లో బోదె
పిల్ల చేపల గుంపు
నన్ను చూసి చెదిరాయి.

* *

నదిలో ఆకాశం
జరగటం లేదు
నీరు ప్రవహిస్తోంది.

* *

—గోపిరెడ్డి రామకృష్ణారావు

"ప్రబుధ కాలంనాటి బుద్ధులేంటండి బాబూ! మనం ప్రజాస్వామ్యయుగంలో అందులో దళిత పోరాటాల కాలంలో వున్నాం. పాత బారామీటర్లు అన్నీ మూలనపడెయ్యండి" అన్నది పరిమళ.

ట్రంకుపెట్టె మీద తల ఆనించి చాప మీద నడుం వాల్చగానే "టీ త్రాగుతారా?" అని అడిగింది.

"పాలున్నాయా?" అన్నాను.

"ఉన్నాయి"

"అయితే తాగుతాను" అన్నాను.

"పాలు లేందే టీ తాగుతారా? అని ఎందుకడుగుతాను?"

"నీ బ్లాక్ టీ అద్భుతం అని అప్పుడెప్పుడో చెప్పానుగా!"

"సరేలెండి" అని టీ తయారుచెయ్యటంలో మునిగిపోయింది సీరియస్‌గా.

పరిమళ ఏ పనిచేసినా సీరియస్‌గాను సిన్సియర్‌గానూ చేస్తుంది. అందుకే చూడముచ్చటేస్తుంది.

మేం యిద్దరం టీ త్రాగుతుండగా... శంకరయ్యగారు లోపలకు వచ్చారు. ఆయనే పరిమళ యింటి ఓనరు. వస్తూ... వస్తూనే పరిమళమీద విరుచుకుపడ్డాడు.

"అమ్మాయి నీకు ఎన్నిసార్లు చెప్పాను? ఇదంతా సంసారులుంటే లోకాలిటీ అని" అన్నాడు.

"యివ్వాడు అంత కానిపని నేనేం చేసానండి?"

"ఏం చేసానంటావేమిటి? అర్ధరాత్రి దాకా ఈ అబ్బాయితో తిరుగుళ్లేంటి? చుట్టుప్రక్కల వాళ్లంతా నాకు కంప్లయింట్ చేస్తున్నారు. అసలు నీకు ఈ అబ్బాయికి సంబంధం ఏంటి?" కొంచెం ఘాటుగా ప్రశ్నించాడు.

"ఇంతకుముందే చెప్పానుగా?, నా స్నేహితుడని?"

"స్నేహితుడంటే ఎలాంటి స్నేహితుడు?"

"స్నేహంలో ఉన్న రకాలు..వాటి రంగు రుచి వాసన నాకు తెలీదు. అయినా అదంతా మీకు అనవసరం" పరిమళ కొంచెం కోపంగానే అంది.

వాళ్లిద్దరి వాగ్యుద్ధం మధ్య నా పాత్రేమిటో అర్ధంకాక మౌనంగా వుండిపోయాను.

ఆయన వార్నింగ్ లాంటిది యిచ్చి వెళ్లిపోయాడు. బహుశా నేను గమనించి వుండను కానీ...ఈ గొడవ అంతా చాలా సీరియస్‌గానే రగులుతున్నట్లుంది. శంకరయ్యగారు బయటికి వెళ్లగానే "ఏముంటుంది?" అన్నట్లు కొన్ని పదుల మొహాలు ఆత్రంగా ప్రశ్నిం

**చేసేందుకు ఏమీలేక పుస్తకాల షెల్ఫ్‌లోంచి ''ఏమీకాదు'' అన్న కవితా సంపుటిని తీసి చదవసాగాను. కిటికీ పక్కగా ఎవరో కదిలినట్లు అన్పించింది. తలుపు తీసి చూద్దును కదా... ఎవరో అమ్మాయి పడుతున్న వర్షం బారినుంచి తప్పించుకోవడానికి గది చూరుకిందకు చేరింది.**

చాయి.

ఆయన రుసరుసలాడుతూ ఏదో చెప్తున్నాడు.

నాకు విషయం అంతా అర్థమయింది. అర్థంకాకపోవడానికి నేనేం చిన్న పిల్లాడ్ని కాదు.

"పోనీ నేను రావడం మానెయ్యనా?" అన్నాను. "మీరు మరీ యింత పిరికివాళ్లా?" అన్నది పరిమళ.

నేనేం మాట్లాడలేదు.

యిదంతా జరిగిన ఓ పదిహేను రోజులకు అనుకుంటాను.

నేను ఆఫీసులో వుండగా పరిమళ వచ్చింది. క్యాంటీన్లో కూర్చుని కాఫీ కప్పు పరిమళ ముందుకు నెడుతూ "ఏంటి సంగతి?" అన్నాను.

"నాకు అర్జంటుగా ఒక ఓ మూడు వేల రూపాయలు కావాలి. అప్పుగానే" అన్నది.

"ఎందుకో" అడిగాను. పరిమళకి మూడువేల రూపాయల అవసరం ఏం వచ్చిందో అర్థంకాక.

"చెప్తాను. తర్వాత" అన్నది.

"సరే! ఎప్పుడు కావాలి?"

"ఎంత తొందరగా యిస్తే అంత మంచిది"

"అయితే రేపు సాయంత్రం యిస్తాను" పరిమళ వెళ్లిపోయింది.

మూడువేల రూపాయలు కావల్సినంత అర్జంటు అవసరం ఏం వుందో నాకు ఎంతకూ అర్థంకాలేదు. మర్నాడు సాయంత్రం పరిమళ అడిగినట్లుగానే మూడువేలు యిచ్చాను. ఆ తర్వాత వారం రోజుల పాటు పరిమళ దర్శనభాగ్యం నాకు గలుగలేదు. ఎనిమిదో రోజు సాయంత్రం ఊరి చివర ఒక పాక దగ్గరికి తీసుకెళ్లి

"ఇదే మన నూతన రాజ ప్రసాదము" అన్నది సినిమా టిక్‌గా!

"నేనిచ్చిన మూడువేలతో ఊరి చివర పరిమళ ఈ పాక వేయించిందన్న మాట!"

లోపలకు వెళ్లాము. సామానంతా తెచ్చేసుకున్నట్లుంది.

"యింత హఠాత్తుగా యిక్కడకు ఎందుకు మారినట్లు"

"హఠాత్తుగానా? ఇప్పటికే ఆలస్యం అయింది!" పరిమళ స్టౌ వెలిగిస్తూ చెప్పసాగింది.

"నెలనెలా రెండువందల యాభై రూపాయలు అద్దె తీసుకునే శంకరయ్యగారు స్త్రీ పురుష సంబంధాలు అంటే సెక్స్ తప్పితే మరేంలేదు అనుకుంటాడు. మీరొస్తే మీతో సంబంధం అంటగడతాడు. పాలవాడు వస్తే పాలవాడితో సంబంధం అంటగడతాడు. ఆడ స్నేహితులు వస్తే వాళ్లు కూడా "లెస్బియన్లా" అన్నట్లు చూస్తాడు. వాడితో రెండు సంవత్సరాలు నరకం అనుభవించాను. యిప్పుడిక నా ప్రాణానికి హాయిగా వుంది. దాంతోపాటు నెలకు రెండు వందల యాభయి రూపాయలు ఆదా! అఫ్‌కోర్స్ మీ అప్పు తీర్చాలి అనుకోండి"

"ఓనరు నచ్చకపోతే ఊరి బయట పాక వెయ్యడమేంది? వేరే యింట్లోకి మారొచ్చుకదా!"

"మారొచ్చు కానీ నెలకు నాలుగు వందలు, ఐదు వందలు పెడితేకానీ గది అద్దెకు దొరకదు మాస్టారూ! నెల రోజులు గొడ్డుచాకిరీ చేసినా మనకు వచ్చేది నెలకు ఐదు వందలే! నూతన ఆర్థిక విధానాల ఫలితం యిదే సార్. గదిలోంచి పాకలోకి వచ్చాను"

"ఏమయినా నువ్వు చేసిందేం నచ్చలేదునాకు" కొంచెం నిష్టూరంగానే అన్నాను నేను. నిజానికి పరిమళ లాంటి ఒంటరి ఆడపిల్ల ఇలా ఒక్కతి నడిరోడ్డుమీద వుండటం నాకు నచ్చలేదు. ఆమాటే అన్నాను.

"పదిమంది మధ్య రక్షణ వుంది కనుకనా? నడిరోడ్డుమీద లేదు అనుకోవడానికి" పరిమళ ఆర్గ్యుమెంట్.

ఎందుకో మనసు సమాధానపడలేదు నాకు.

"ఈ స్థలం ఎవరిది?"

"ప్రభుత్వానిది!"

"అంటే ఆక్రమణా?"

"ఖచ్చితంగా!"

మరేం మాట్లాడలేదు నేను. పరిమళ స్వభావం నాకు తెలుసు. తాను మంచి పోనీ తప్పనిసరి అనుకున్నది ఖచ్చితంగా చేసి తీరుతుంది.

"యింతకూ మీ సమస్యేంటి? మొహం అదోలా పెట్టారు?" అడిగింది పరిమళ.

"ఏంలేదు?"

"మీ బాధ నాకు అర్థం అయింది లెండి! నన్ను కలవాలి అంటే ఈ గుడిసె దాకా మీరు రావాలి. మీ స్కూటర్ ఈ రోడ్డుమీదే పెట్టాలి. మీకు పబ్లిక్ రిలేషన్స్ ఎక్కువకదా! మీ స్కూటర్ యిక్కడుంది ఏంటి అనే ఆరా వస్తుంది. గుడిసెలో అమ్మాయితో స్నేహం ఏంటి అని వస్తుంది. అది మీ డిగ్నిటీకి భంగం అంతేకదూ!"

"ఛ...ఛ..ఆదేంలేదు?"

"నాకు తెలుసులెండి. ఖచ్చింగా మీ Feeling అదే!"

"నువ్వు అట్లా అనుకుంటే నేనేం చెయ్యలేను"

ఆ తర్వాత చాలాసేపు మాట్లాడుకున్నాం నేనూ పరిమళా....మర్నాడు ఆఫీసు పనిమీద కేంప్‌కి వెళ్లాల్సి వచ్చింది. వెళ్తూ...వెళ్తూ...పరిమళకి చెప్పే వెళ్లాను పదిహేను రోజుల తర్వాత వస్తానని. పదిహేను రోజుల తర్వాత ఆఫీసులో జాయినయి...పరిమళ కోసం ఊరి చివరకు బయల్దేరాను. నేను అక్కడికి వెళ్లేసరికి దృశ్యం బీభత్స ప్రధానంగా వుంది. రోడ్డుకి యిరువైపులా ఆక్రమించుకుని వున్న పాకలన్నీ బుల్‌డోజర్లతో కూల్చేసి వున్నాయి. ముందు నోటీసు యివ్వకుండా, కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకోకుండా క్షణాల మీద రోడ్ల విస్తరణ కార్యక్రమం పూర్తి అయింది అనిపించింది ప్రభుత్వం.



దాదాపు యాభై కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రొక్లెయినర్ తన పొడవాటి భస్మాసుర హస్తంతో పాకలన్నీ నేలమట్టం చేసింది. ముసలివాళ్లు, చిన్న పిల్లలు హాహాకారాలు, కూల్చివేత కార్యక్రమం చూడవచ్చిన వాళ్ల ప్రశ్నార్థక మొహాలతో ఆ వాతావరణం అంతా అనూహ్యంగా వుంది. రస్కిన్ బాండ్ కథల్లోని వర్ణనలాగా వుంది. వీళ్లందరి మధ్యా పరిమళ కోసం వెతికాను. కూలిపోయిన పాక శిథిలాల మధ్య...ప్లాస్టిక్ బకెట్‌లో దళిత కవితా సంపుటలు నింపుతూ...

"మాస్టారూ! పాక పోయింది. మూడువేలు అప్పుమాత్రం మిగిలింది!" అంటూ నవ్వుతూ కన్పించింది.

ఆ క్షణంలో పరిమళని అలా చూడగానే...తన పాత గదిలో...వెళ్లగానే కన్పించే ఇంగ్లీష్ కొటేషన్ ఒకటి గుర్తుకొచ్చింది నాకు.

*"To live with out future is the greatest courage. the present has un explored and unlived".*

పరిమళ గురించి తప్పిస్తే మరెవరి గురించి నేను కథ వ్రాయను?

ప్లాస్టిక్ బకెట్‌తో పాటు తన లగేజి అంతా చంకలో పెట్టుకుని "ఊ..పదండి!" అన్నది పరిమళ స్కూటర్ ఎక్కి కూర్చుంటూ.

## ఓ చిట్టి తగాదా

వెన్నెల వేళ.
పాపలిద్దరు
ఆరుబయల
అద్దంతో ఆటలాడుకుంటుంటే-
అద్దంలోకి తొంగిచూసి
చంద్రుడు
పాపల కనుపాపల్లో దొరికిపోయాడు.
పాపలిద్దరూ
ఆటమానేసి
చందమామ నాదంటే నాదని
పోటాడుకుంటున్నారు.
తోవలో నడుస్తున్నందుకు
నే తగువు తీర్చాల్సి వచ్చింది.
ఏం చెప్పమంటారు?

– పి.శ్రీనివాసగౌడ్